

# అమెరి'కా'లేజ్

## – లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయో, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయో... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదువుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ – ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*– సంపాదకుడు*

(కిందటి సంచికనుండి కొనసాగింపు)

**ఉదయం లేచేసరికి** అంతా చీకటిగా ఉంది. ఇంకా రాత్రనుకుని ఫోన్‌లో తక్కువ సౌండ్‌తో యూ ట్యూబ్ చూడసాగాను. ఇంతలో మళ్ళీ నిద్రపట్టేసింది. ఏదో పెద్ద చప్పుడు అవ్వడంతో లేచాను. చూస్తే అన్నయ్య కిచెన్‌లో ఏదో పడేసాడు. ఇద్దరం కలిసి ఆ గాజు ముక్కలు ఏరాము.

"జాగ్రత్త గుచ్చుకుంటుంది" అన్నాడు.

"సరే. నువ్వు ఇక్కడ నడిచేప్పుడు చెప్పులు వేసుకో" అన్నాను.

"నీకు గుర్తుందా? చిన్నప్పుడు ఒకసారి ఫ్లవర్ వాజ్ పడిపోతే అమ్మ మనల్ని తిట్టింది?"

"ఔను. లాస్ట్‌కి పనిమనిషి అనుకుని మనల్ని వదిలేసింది."

"నాన్న కొడతారని భయపడ్డాను."

"నీకో నిజం చెప్పనా?"

"కొంపతీసి నువ్వే పడేసావా ఏంటి?"

"ఔను. నా చున్నీ తగిలి అది కింద పడింది."

"పాపం. అమ్మ పనమ్మాయి అనుకుని తిట్టింది."

వెంటనే నాకు నా పైన కోపం కలిగింది. అనవసరంగా పాపం ఆ పనమ్మాయి నావల్ల నింద మోసింది. అన్నయ్య కిచెన్‌లో చిన్న పెంకులు ఎత్తేందుకు వాక్యూమ్ క్లీన్ చేస్తుండగా నేను గదిలోకి వెళ్ళి అమ్మకి ఫోన్ చేసాను.

"ఎలా ఉన్నావు తల్లి?"

"బానే ఉన్నాను."

"అన్నయ్య ఎలా ఉన్నాడు? బానే చూసుకుంటున్నాడా?"

"యా. అమ్మా నీకు గుర్తుందా? మన టీపాయ్ మీద ఒక గ్రీన్ కలర్ ఫ్లవర్ వాజ్ ఉండేది."

"గుర్తుంది. అది ఎవరో చెయ్యి తగిలి పగిలిపోయింది."

"అప్పుడు నువ్వు నన్ను, అన్నయ్యని తిట్టి, ఆ తర్వాత పనిమనిషి సంగతి చెప్తా అన్నావు."

"అవన్నీ. ఇప్పుడు అదెందుకు గుర్తొచ్చింది?"

"కిచెన్‌లో ఏదో పడితే గుర్తొచ్చింది కానీ, నీకో విషయం చెప్పాలి."

"చెప్పు"

"తిట్టకూడదు."

"అది పగలగొట్టింది నువ్వేనా?"

"ఔను. నీకెలా తెలుసు?"

"నాకు అప్పుడే అర్థమైంది నువ్వే అని."

"ఎలా?"

"అమ్మకి అన్నీ తెలుస్తాయి."

"మరి పనిమనిషిని ఎందుకు తిట్టావు?"

"తిట్టలేదు. అన్నయ్య నీతో పోట్లాడకూడదని అలా అబద్ధం చెప్పాను"

నిశ్శబ్దంగా ఉన్నాను.

"నీవల్ల వాడికి తిట్లు పడ్డాయని తెలిస్తే నీ వీపు విమానం మోత మోగించేవాడు."

"అయితే కావాలని నన్ను ఏమీ అనలేదా?"

"లేదు. వాడికన్నా నిన్ను చాలా గారాబం చేసాను. చాలాసార్లు నిన్ను తిట్టాలంటే మనసు రాక ఇద్దరినీ కలిపి తిట్టాను."

నా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఇంతలో అన్నయ్య వచ్చాడు.

"అయిపోయింది క్లీనింగ్. ఎవరితో మాట్లాడుతున్నావు?" అడిగాడు.

"అమ్మతో".

ఫోన్ తన చేతికిచ్చి బాత్‌రూములోకి వెళ్ళిపోయాను. నా స్నానం పూర్తయ్యేసరికి అన్నయ్య లాప్‌టాప్‌లో పని చేసుకుంటున్నాడు.

"ఏమంది అమ్మ" అడిగాను.

"ఆకాయ్ పోకాయ్ కబుర్లు చెప్పింది" నవ్వుతూ లాప్‌టాప్ మూసాడు.

"అన్నయ్య, వాజ్‌ని నేను పగలగొట్టాను."

"వాజా? ఎక్కడ?" ఆశ్చర్యపోయాడు.

"చిన్నప్పుడు."

పెద్దగా నవ్వి "అది చెప్పడానికా అమ్మకి ఫోన్ చేసావు?" అడిగాడు.

"అవును. అనవసరంగా నా వల్ల పనమ్మాయికి తిట్లు పడ్డాయేమో అని బాధ కలిగింది."

ఆవిడ ఇవ్వాళ వినాయక స్తోత్రం చదివిందేమో."

"ఏంటి?" అర్థంకాక అడిగాను.

"నీలపనింద తొలిగిపోయింది కదా"

"అమ్మకి ముందే తెలుసట."

ఇద్దరం నవ్వుకున్నాము.

భోజనం అయ్యాక ఇద్దరం బయటకి వెళ్దామనుకున్నాము.

"చిన్నప్పుడు మనం పెయింటింగ్ చేసేవాళ్ళం. గుర్తుందా?" భోంచేస్తూ అడిగాడు.

"గుర్తుంది. నావి నీకన్నా బావుండేవి"

"ఛా. నావే బావుండేవి. నువ్వు నేను ఏం గీస్తే అదే కాపీ కొట్టేదానివి."

"కాదు. నువ్వు పిచ్చిగా గీసినవి నేను అందంగా గీసేదాన్ని."

"ఇలా ఎప్పటినుండి అనిపిస్తుంది?" వెక్కిరించాడు.

కోపంగా చూసాను.

"సరే. ఇప్పుడు చూద్దాం ఎవరు బాగా వేస్తారో."

"ఇప్పుడా?" ఆశ్చర్యపోయాను.

"తిన్నాక."

"ఇంట్లో కలర్స్ ఉన్నాయా?"

పెద్దగా నవ్వి "లేదు, పెయింటింగ్ క్లాస్‌కి వెళ్తున్నాము" అన్నాడు.

"నువ్వు పెయింటింగ్ క్లాసులో జాయిన్ అయ్యావా?"

"లేదు, మనం ఒక క్లాసుకి వెళ్దాం. అక్కడ ఒక క్లాస్ ఫ్రీ గా చెప్తారు. ఇన్‌స్ట్రక్టర్ నేర్పిస్తారు. ఒక పెయింటింగ్ గీస్తాము"

నాకు విచిత్రంగా అనిపించింది. చిన్న పిల్లల్లా బొమ్మలు గీయడమేంటి అని కాస్త చిరాకు కలిగింది.

తినడం పూర్తయ్యాక "వెళ్దామా?" అడిగాడు.

"ఇప్పుడే తిన్నాం కదా, కాసేపు ఆగి వెళ్దాం" అన్నాను.

"సరే, పోనీ 5 కి వెళ్దామా?"

"ఓకే"

ఈలోగా సినిమా చూస్తూ మర్చిపోతాడనుకున్నాను కానీ ఖచ్చితంగా ఐదింటికి రెడీ అవ్వమన్నాడు.

"అబ్బా. ఇప్పుడు వెళ్ళాలా?" అన్నాను.

"ఏ? బద్దకంగా ఉందా?" అడిగాడు.

"లేదు. పెయింటింగ్ అంటే బోర్."

"వెళ్తే కదా తెలిసేది. బావుంటుంది. నీకు నచ్చుతుందిలే. పద"

అయిష్టంగా బయలుదేరాను.

"అలిగావా?" అడిగాడు.

"లేదు. ఎంతసేపు క్లాస్?"

"గంట."

కళ్ళు మూసుకుని తెరిస్తే అయిపోతుందిలే అనుకున్నాను. లోపలికి వెళితే మా వయసువారే ఎక్కువ ఉన్నారు. కొంతమంది ముసలివాళ్ళు కూడా ఉన్నారు. ఒక మూల టేబుల్ మీద ఒక వైన్ సీసా, కొన్ని చీజ్ ముక్కలు ఉన్నాయి.

'ఎక్కడ కూర్చుంటావు?" అన్నయ్య అడిగాడు.

ఎవరికీ నా పెయింటింగ్ కనబడకుండా ఉండేందుకు మూలకి కూర్చుందాం అన్నాను. అన్నయ్య నా పక్కన ఉన్న ఈజిల్ బోర్డ్ దగ్గర కూర్చున్నాడు.

"ఆ వైన్ ఎవరైనా తాగొచ్చా?" అడిగాను.

"ఏ? కావాలా?"

"ఛీ.ఛీ ఊరికే అడిగా."

"ఇది వైన్ అండ్ పెయింట్ క్లాస్" నవ్వాడు.

మా ఇద్దరి దగ్గర మాత్రమే గ్లాసు లేకపోవడంతో ఏమైనా కావాలా అని ఇన్స్ట్రక్టర్ అడిగింది.

"షీ డజంట్ డ్రింక్. ఐయామ్ డ్రైవింగ్" అన్నయ్య అన్నాడు.

దాంతో మా ఇద్దరికి తలా ఒక నీళ్ళ సీసా ఇచ్చింది.

"ఆర్ యు రిలేటెడ్?" అడిగింది.

"యస్. షీ ఈజ్ మై సిస్టర్" అన్నయ్య అన్నాడు.

"యు లుక్ అలైక్" అని క్లాసు మొదలు పెట్టింది.

నేను అనుకున్నట్లుగా బోర్ కొట్టలేదు. అన్నయ్య కన్నా బాగా గీయాలి అనే తపనతో కాస్త కష్టపడ్డాను కానీ, లేకపోతే నిజంగానే ఆహ్లాదంగా ఉంది. గీసింది కూడా ఈజీగానే అనిపించింది. చాలామంది వారు తప్పు గీసినప్పుడు మిగతావారిని చూడమని నవ్వారు, కానీ చిన్నబోయి దాచలేదు. అది నాకు భలే నచ్చింది. పొరపాటున నేను బ్రష్ కడగకుండా నీలిరంగు బ్రష్తో గ్రీన్ రంగు వేయడంతో నా బొమ్మ పాడైంది. ఖంగారుగా అన్నయ్యకి సైగ చేసాను. అన్నయ్య పగలబడి నవ్వడంతో అందరి దృష్టి నామీద పడింది. నేను చిన్నబోయాను.

ఇన్స్ట్రక్టర్ రెండు నిమిషాల్లో నా తప్పుని కప్పి పుచ్చి "ఏజ్ గుడ్ ఏజ్ న్యూ" అని వెళ్ళిపోయింది.

అందరితో కలిసి నేనూ నవ్వసాగాను. ఆ తరవాత వారితో మాట్లాడాను కూడా.

"నచ్చిందా?" బయలుదేరేప్పుడు అడిగాడు.

"బావుంది. ఇలా ఉంటుందని అనుకోలేదు"

"నాదే బావుంది నీ దానికన్నా" వెనక సీట్లో ఉన్న కాన్వాస్ చూపించి అన్నాడు.

"ఏం కాదు నాదే బావుంది."

"నీ కలర్స్ చాలా డార్క్ ఉన్నాయి. నావి సటుల్గా బావున్నాయి."

"ఏం కాదు. నీది వెలిసిపోయినట్టు ఉంది" అంటూ ఇంటికి చేరాము.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story